

నమూనా చెక్కును ఆవిష్కరిస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు తదితరులు

లక్ష్యం చేరుకునేనా..?

- జిల్లాలో గృహ నిర్మాణాల లక్ష్యం 35,195 ఇళ్లు
- ఇప్పటివరకు పూర్తయినవి 23,568 గృహాలు
- వచ్చే నెల 31వ తేదీ లోగా పూర్తి చేయాలని ప్రభుత్వ ఆదేశం
- గృహ ప్రవేశాలకు త్వరలో తేదీ నిర్ణయం

జగనన్న కాలనీల్లో సామూహిక గృహ ప్రవేశాలు చేపట్టాలని ప్రభుత్వం పలుమార్లు ప్రయత్నించినా నెరవేరలేదు. గృహ ప్రవేశాలకు తేదీలను నిర్ణయించినా, చివరి క్షణంలో రకరకాల కారణాలతో వాయిదా వేసుకోవాల్సి వచ్చింది. 2022లో విజయదశమి రోజున నిర్వహిస్తామని ఒకసారి, ఆ తర్వాత ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పుట్టిన రోజైన డిసెంబర్ 21న చేపడతామని మరోసారి ప్రకటించి చేయకుండా అభాసుపాలైంది. గృహ నిర్మాణాల లక్ష్యం కనీసం 50 శాతం కూడా దాటకపోవడమే ఇందుకు కారణం. ఇళ్ల ప్రవేశాలకు తేదీని నిర్ణయించకుండా జులై 31వ తేదీ నాటికి జిల్లాకు ఇచ్చిన లక్ష్యం పూర్తి చేయాలని అధికారులకు సూచించినట్లు తెలిసింది. ఇళ్ల నిర్మాణాల పూర్తిని బట్టి సామూహిక గృహ ప్రవేశాల తేదీని నిర్ణయించనున్నట్లు తెలిసింది. దీంతో ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేసే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు (ఎన్‌పిఐ) పథకంలో భాగంగా జిల్లాలో 74,811 ఇళ్లు మంజూరయ్యాయి. వీటిలో 35,195 ఇళ్లను పూర్తిస్థాయిలో జులై 31వ తేదీ నాటికి సిద్ధం చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించింది. ఇళ్ల నిర్మాణాలతో పాటు ఇళ్లకు విద్యుత్, తాగునీటిని సరఫరా చేయాలని సూచించింది. ఇందులో ఇప్పటివరకు 25,788 ఇళ్లు (73.27 శాతం) పూర్తయ్యాయి. మరో 9,407 ఇళ్లు పూర్తి చేయాల్సి ఉంది. 72,669 ఇళ్లు ఆన్‌లైన్‌లో రిజిస్టర్ అయ్యాయి. ఇప్పటివరకు 3,767 ఇళ్లు ప్రారంభం కాలేదు. వీటిలో బిబిఎల్ (బిలో బేస్‌మెంట్ లెవల్) దశలో 23,914 ఇళ్లు, పునాది దశలో 10,028, పైకప్పు దశలో 5,541 ఇళ్లు ఉన్నాయి. శ్లాబ్ పూర్తయినవి 3,626 ఇళ్లు ఉన్నాయి. ఇప్పటివరకు 25,788 ఇళ్లు పూర్తిస్థాయిలో నిర్మాణం జరిగాయి. మండలాల వారీగా ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తే, ఆమదాలవలస మండలంలో అత్యధిక నిర్మాణాలు పూర్తయ్యాయి. మండలానికి 872 ఇళ్లను లక్ష్యంగా నిర్దేశించగా 787 ఇళ్లు (90.37 శాతం) పూర్తయ్యాయి.



సరుబుజ్జిలి మండలానికి 742 ఇళ్లను కేటాయించగా 657 వరకు (88.54 శాతం) నిర్మాణాలు జరిగాయి. లావేరు మండలానికి 1885 ఇళ్లు లక్ష్యంగా నిర్దేశించగా 1616 ఇళ్లు (85.73 శాతం) పూర్తయ్యాయి. పోలాకి మండలంలో 1330 ఇళ్లను నిర్మించాల్సి ఉండగా 1140 ఇళ్ల (85.71 శాతం) నిర్మాణాలు జరిగాయి. పొందూరు మండలానికి 985 ఇళ్లు లక్ష్యం కాగా 824 ఇళ్లు (83.65 శాతం) నిర్మించారు.

అర్బన్ ప్రాంతాల్లో మందకొడిగా నిర్మాణాలు

అర్బన్ ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణాలు చాలా మందకొడిగా సాగుతున్నాయి. శ్రీకాకుళం అర్బన్ ప్రాంతానికి 2,976 ఇళ్లను లక్ష్యంగా నిర్దేశించగా 950 ఇళ్లు (31.92 శాతం) పూర్తయ్యాయి. ఇచ్ఛాపురం మున్సిపాలిటీలో 661 ఇళ్లను నిర్మించాల్సి ఉండగా 404 ఇళ్ల (61.12 శాతం) నిర్మాణాలు చేపట్టారు. పలాస-కాశీబుగ్గ ప్రాంతానికి 912 ఇళ్లను కేటాయించగా 610 ఇళ్లు (66.89 శాతం) పూర్తయ్యాయి. ఆమదాలవలస అర్బన్ ప్రాంతంలో ఇళ్ల నిర్మాణాల పరిస్థితి చాలా మెరుగ్గా ఉంది. ఇక్కడ 719 ఇళ్లను నిర్మించాలని లక్ష్యంగా నిర్ణయించగా, 587 ఇళ్లు (81.14 శాతం) పూర్తయ్యాయి.

లేఅవుట్లలో నామమాత్రంగా విద్యుత్ కనెక్షన్లు

జగనన్న కాలనీల్లో మౌలిక వసతుల కల్పనలోనూ వెనుకబాటు కనిపిస్తోంది. ప్రధానంగా తాగునీరు, విద్యుత్, రహదారుల పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఇప్పటివరకు 25,788 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. వాటిలో సొంత స్థలాల్లో ఇళ్లు నిర్మించుకుంటున్న వారు 21,464 మంది, జగనన్న లేఅవుట్లలో ఇళ్లు నిర్మించుకుంటున్న వారు 4,324 మంది ఉన్నారు. వీటిలో ఇప్పటివరకు 20,911 ఇళ్లకు (81.09 శాతం) విద్యుత్ సరఫరాను అందించగలిగారు. ఇందులో సొంత స్థలాల్లో నిర్మాణం చేపడుతున్న 19,281 ఇళ్లకు, లేఅవుట్లలో ఉన్న 1630 ఇళ్లకు విద్యుత్ కనెక్షన్లు ఇచ్చారు. మందస, సోంపేట ప్రాంతాల్లో ఐదేసి చొప్పున ఇళ్లకు మాత్రమే విద్యుత్ సరఫరా అందించగలిగారు. ఆమదాలవలస, ఇచ్ఛాపురం అర్బన్ ప్రాంతాల్లో ఏడేసి ఇళ్లకు, పలాస, టెక్కలి మండలాల్లో ఏడేసి ఇళ్లకు విద్యుత్ సరఫరా ఏర్పాట్లు పూర్తయ్యాయి.

తాగునీటి సౌకర్యమూ అంతంతమాత్రమే

ఇళ్ల నిర్మాణ లబ్ధిదారులకు అంతంతమాత్రంగానే తాగునీటి సౌకర్యం అందించారు. జిల్లాలో 25,788 ఇళ్ల నిర్మాణాలు పూర్తి కాగా, 20,582 ఇళ్లకు (79.81 శాతం) తాగునీటి కనెక్షన్లు ఇచ్చారు. వీటిలో లేఅవుట్లలో కేవలం 1558 ఇళ్లకు మాత్రమే తాగునీటిని అందించగలిగారు. మిగిలిన 19,024 కనెక్షన్లు సొంతంగా ఇళ్ల నిర్మించుకుంటున్న లబ్ధిదారులకు ఇచ్చారు. మందస, కవిటి లేఅవుట్లలో ఐదేసి ఇళ్లకు విద్యుత్ కనెక్షన్ ఇచ్చారు. శ్రీకాకుళం, ఆమదాలవలస అర్బన్‌లో ఆరు ఇళ్లకు, ఇచ్ఛాపురం అర్బన్‌లో ఎనిమిది, పలాసలో తొమ్మిది ఇళ్ల కనెక్షన్లు ఇచ్చారు.

వచ్చే నెల 31 నాటికి గృహాలు సిద్ధం

జగనన్న లేఅవుట్లలోని ఇళ్లను వచ్చే నెల 31వ తేదీ నాటికి సిద్ధం చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. జిల్లాలో 35 వేలకు పైగా ఇళ్లను ఆ తేదీ నాటికి పూర్తి చేయాలన్న లక్ష్యంగా నిర్దేశించింది. ఇళ్ల నిర్మాణాలు వేగవంతమయ్యేలా కృషి చేస్తున్నాం. సిబ్బందికి ప్రతి వారం లక్ష్యాలను నిర్ణయించి, వాటిని చేరుకునేలా చర్యలు చేపడుతున్నాం.

- ఎన్.గణపతి,
పీడీ, గృహ నిర్మాణ సంస్థ

రైతుల్లో సంతోషం లేదు

- గిట్టుబాటు ధర ఉండడం లేదు
- రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

రైతుల్లో నాడు ఉన్న సంతోషం నేడు లేదని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేకపోవడమే ఇందుకు కారణమని తెలిపారు. నగరంలోని బి.ఆర్ అంబేద్కర్ కళా వేదికలో శుక్రవారం ఏర్పాటు చేసిన వైఎస్సార్ యంత్ర సేవా పథకంలో భాగంగా ట్రాక్టర్లు, హార్వెస్టర్లు, ఇతర వ్యవసాయ యంత్ర పరికరాల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయంపై కుటుంబం ఆధారపడే రోజులు కనుమరుగయ్యాయని చెప్పారు. రాష్ట్రంలోనే కాదు దేశం మొత్తం ఇలాగే ఉందన్నారు. వ్యవసాయానికి అవసరమైన అన్ని ధరలూ పెరిగాయని, రైతుకు ఏమీ మిగలడం లేదన్నారు. ఇలాంటి నేపథ్యంలో రైతులకు అండగా వైసిపి ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. రైతుభరోసా కేంద్రాల ద్వారా విత్తనం నుంచి విక్రయం వరకు చేస్తున్నట్లు చెప్పారు. రైతులకు అండగా ఎల్లవేళలా వైసిపి ప్రభుత్వం ఉంటుందని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. రైతులు యాంత్రీకరణ సేవలు వినియోగించుకుని దిగుబడులు పెంచే దిశగా అడుగులు వేయాలన్నారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా పంటల ఉత్పత్తి పెంచాలని, ఉత్పత్తి పెరగడానికి ఆధునిక శాస్త్ర సాంకేతికను వినియోగించుకోవాలని సూచించారు.

ఇన్‌ఛార్జి కలెక్టర్ ఎం.నవీన్ మాట్లాడుతూ జిల్లాలోని 30 మండలాలకు సంబంధించి రూ.3736.187 లక్షల విలువ



ట్రాక్టర్‌పై స్పీకర్ సీతారాం

గల 328 యంత్ర సేవా పరికరాలను రూ.1294.537 లక్షల రాయితీతో రైతుసంఘాలకు అందించనున్నట్లు తెలిపారు. రైతుభరోసా కేంద్రాల స్థాయిలో రూ.3186.187 లక్షల విలువ గల 269 ట్రాక్టర్లను 306 సిహెచ్‌సి గ్రూపులకు రూ.1100.937 లక్షల రాయితీతో అందిస్తున్నట్లు చెప్పారు. రూ.550 లక్షల విలువ గల క్లస్టర్ లెవల్ వ్యవసాయ పరికరాలను రూ.193.60 లక్షల రాయితీతో రైతు సంఘాలకు అందజేయనున్నట్లు తెలిపారు.

డిసిసిబి చైర్మన్ కరిమి రాజేశ్వరరావు మాట్లాడుతూ జిల్లాలో 328 సిహెచ్‌సి గ్రూపులకు రాయితీపై రైతులకు రుణాలు మంజూరు చేసినట్లు చెప్పారు. రైతులు వాణిజ్య పంటలపై దృష్టిసారించాలన్నారు. అనంతరం సిహెచ్‌సి గ్రూపులకు ట్రాక్టర్లు, కంబైన్ హార్వెస్టర్లు, వ్యవసాయ పరికరాలను, నమూనా చెక్కును అందించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు ధర్మాన కృష్ణదాస్, కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ నేతాజీ, కార్పొరేషన్ల చైర్మన్లు అంధవరపు సూరిబాబు, మామిడి శ్రీకాంత్, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

మెగా జాబ్‌మేళాకు స్పందన

శ్రీకాకుళం : రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యాన స్థానిక ఆర్ట్స్ కళాశాల ఆవరణలో శుక్రవారం నిర్వహించిన మెగా జాబ్‌మేళాకు స్పందన లభించింది. జాబ్ మేళాకు 15 ప్రయివేటు సంస్థల ప్రతినిధులు హాజరై ఇంటర్వ్యూలు నిర్వహించారు. 533 మంది ఇంటర్వ్యూలకు హాజరు కాగా 209 మంది పలు కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా డిఆర్‌డిఎ పీడీ డి.వి విద్యాసాగర్ మాట్లాడుతూ జాబ్‌మేళాలను యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పి.బి సాయిశ్రీనివాస్ మాట్లాడుతూ ఇంటర్వ్యూకు హాజరై ఎంపిక కాని అభ్యర్థులు స్కిల్ హబ్స్ ట్రైనింగ్‌లో చేరి తదుపరి జాబ్‌మేళాల్లో ఉపాధి సంపాదించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధి అధికారి సుధ, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ సురేఖవాణి, సెట్‌శ్రీ సిఇఒ బి.ప్రసాదరావు, జిల్లా పర్యాటక అధికారి ఎన్.నారాయణరావు, నోడల్ జెకెసి కోఆర్డినేటర్ పైడితల్లి తదితరులు పాల్గొన్నారు.

చనిపోతూ మరికొందరికి జీవం

- మధుపాం సిఎఫ్ చంద్రకళ బ్రెయిన్ డెడ్
- అవయవదానానికి అంగీకరించిన కుటుంబసభ్యులు

ప్రజాశక్తి - జి.సిగడాం

సిఎఫ్‌గా పొదుపు సంఘాల మహిళలకు సేవ చేయడమే కాదు... తాను చనిపోతూ అవయవ దానంతో మరికొందరికి ప్రాణదానం చేసింది. మండలంలోని మధుపాం గ్రామానికి చెందిన పట్నాన చంద్రకళ (32) సిఎఫ్‌గా పనిచేసేది. భర్త శివ కూలీగా పనిచేస్తున్నాడు. వారికి ఇద్దరు కుమార్తెలు.



చంద్రకళ (ఫైల్ ఫొటో)



నాలుగు రోజుల కిందట ఆమె అనారోగ్యానికి గురయ్యారు. తీవ్రమైన తలనొప్పి, బిపి పల్స్ రేట్ పడిపోవడంతో శ్రీకాకుళంలోని ఒక ఆస్పత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమంగా మారడంతో అక్కడ్నుంచి విశాఖపట్నంలోని విమ్స్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. న్యూరో సర్జరీ వైద్యుల ఆధ్వర్యాన వైద్య పరీక్షలు చేయగా తలలో తీవ్ర రక్తస్రావమైనట్లు తేలింది. ఆమెను రక్షించేందుకు వైద్యులు తీవ్రంగా శ్రమించినా ఫలితం లేకుండా పోయింది. శుక్రవారం ఆమె బ్రెయిన్ డెడ్ అయినట్లు వైద్యులు నిర్ధారించి కుటుంబసభ్యులు విషయాన్ని తెలిపారు. బ్రెయిన్ డెడ్ కేసులో అవయవాలు దానం చేయొచ్చని, మీరిచ్చే అవయవ దానంతో మరికొంత మందికి జీవితాన్ని ఇవ్వవచ్చని విమ్స్ డైరెక్టర్ రాంబాబు, వైద్యులు, ఎపి జీవన్‌దాన్ సమన్వయకర్తలు కుటుంబసభ్యులు, బంధువులకు అవగాహన కల్పించారు. పుట్టెడు దు:ఖంలోనూ వారు తీసుకున్న నిర్ణయం కొందరి కుటుంబాల్లో వెలుగులు నింపింది. అవయవదానంతో సమాజానికి మార్గదర్శకంగా నిలిచింది. అవయవ దానానికి కుటుంబ సభ్యులు అంగీకరించడంతో విమ్స్‌లో తొలిసారిగా అవయవ దానానికి ఏర్పాట్లు చేశారు. గుండె, ఊపిరితిత్తులు, కిడ్నీలు, రెండు కళ్లు సేకరించారు. కళ్లను ఎల్.వి ప్రసాద్ కంటి ఆస్పత్రికి తరలించారు.

కన్నీటి వీడ్కోలు

చంద్రకళ మృతదేహానికి ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. సెక్యూరిటీ సిబ్బంది గౌరవ వందనం చేసి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. గ్రామంలోని యువత, పొదుపు సంఘాల మహిళలు, ప్రజలు ఆమె మృతదేహానికి నివాళ్లర్పించారు. ఆమె చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. చంద్రకళ అమర్ రహే నినాదాల నడుమ ఆమె అంత్యక్రియలు పూర్తయ్యాయి.

ఆధార్ అప్‌డేట్ తప్పనిసరి

ఇన్‌ఛార్జి డిఆర్‌ఒ మురళీకృష్ణ

ప్రజాశక్తి - శ్రీకాకుళం

2010 నుంచి 2018 మధ్య ఆధార్ కార్డు పొందిన వారు తప్పనిసరిగా అప్‌డేట్ చేసుకోవాలని ఇన్‌ఛార్జి జిల్లా రెవెన్యూ అధికారి మురళీకృష్ణ స్పష్టం చేశారు. పదేళ్లకోసారి అప్‌డేట్ చేసుకోవాలన్నారు. దీనిపై ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లాస్థాయి ఆధార్ మానిటరింగ్ కమిటీ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 ఏళ్ల లోపు వయసున్న వారి ఆధార్ నమోదు, అప్‌డేట్ శత శాతం పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. పుట్టిన పిల్లలకు ఆధార్ పొందేలా ప్రభుత్వ, ప్రయివేట్ ఆస్పత్రుల్లో చర్యలు తీసుకోవాలని తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌ఛార్జి డిఆర్‌ఒ మురళీకృష్ణ

అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో ఆధార్ ప్రక్రియ పూర్తికి కార్యాచరణను సిద్ధం చేసుకోవాలని సూచించారు. 15 ఏళ్ల లోపు పిల్లలకు ఆధార్ అప్‌డేట్ ఉచితంగా రెండుసార్లు చేయొచ్చని, విద్యాసంస్థలతో సమన్వయం చేసుకుని కార్యక్రమం పూర్తి చేయాలన్నారు. ఈ అవకాశం మార్చి 31వ తేదీ వరకు ఉంటుందన్నారు. వివరాల కోసం టోల్ ఫ్రీ నంబర్ 1947ను సంప్రదించవచ్చని సూచించారు. సమావేశంలో ఎఎస్‌పి తిప్పేస్వామి, డిఆర్‌డిఎ పీడీ విద్యాసాగర్, గ్రామ, వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి వాసుదేవరావు, ఎల్‌డిఎం ఎం.సూర్యకిరణ్, అర్బన్ హెల్త్ ఆఫీసర్ జంపు కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

పొందూరు : ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని చేపడుతున్నామని శాసనస స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని లైదాంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నాలుగేళ్లలో 98 శాతం ఎన్నికల హామీలను అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్న పథకాలు పేదల జీవితాల్లో వెలుగులను నింపుతున్నాయని చెప్పారు. ఏదైనా సాంకేతిక కారణం వలన పథకాలు దరిచేరని అర్హత కలిగిన వారు సచివాలయ సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. అనంతరం గడప గడపకూ వెళ్లి ప్రభుత్వం అందించిన లబ్ధిని చదివి వినిపించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి లోలుగు కాంతారావు, పిఎసిఎస్ అధ్యక్షులు కె.రమణమూర్తి, ఎఎంసి చైర్మన్ బాడాన సునీల్‌కుమార్, వైసిపి మండల అధ్యక్షులు పప్పల రమేష్‌కుమార్, ఎపిపి ప్రతినిధి కిల్లి నాగేశ్వరరావు, తూర్పుకాపు కార్పొరేషన్ డైరెక్టర్ కిల్లాన సూర్యారావు, సచివాలయాల మండల కన్వీనర్ బాడాన కృష్ణారావు, వైసిపి నాయకులు గొర్లె జమ్మినాయుడు, రామినాయుడు తదితరులు పాల్గొన్నారు.



పథకాల లబ్ధిని వివరిస్తున్న శాసనసభ స్పీకర్ సీతారాం

నేటి నుంచి గ్రూప్-1 పరీక్షలు


- పదో తేదీ వరకు నిర్వహణ
- సిసి కెమెరాల నిఘాలో పరీక్షలు
- నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ
- తొలిసారి ఫేస్ రికగ్నైజేషన్ విధానం అమలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించే గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈనెల పదో తేదీ వరకు నిర్వహించే పరీక్షలు ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరుగనున్నాయి. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో నిర్వహించే పరీక్షలకు 353 మంది అభ్యర్థులు హాజరు కానున్నారు. నిమిషం నిబంధన కారణంగా అభ్యర్థులను ఉదయం 8.30 గంటల నుంచి 09.45 గంటల వరకే పరీక్షా కేంద్రంలోకి అనుమతించనున్నారు. ఆ తర్వాత ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతించబోరు. ఈసారి ఆఫ్‌లైన్‌లోనే పరీక్షలను నిర్వహిస్తున్నారు.

సిసి కెమెరాల నీడలో...

పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలను అధికార యంత్రాంగం చేపట్టింది. మాస్ కాపీయింగ్‌కు, ట్యాంపరింగ్‌కు ఆస్కారం లేకుండా పటిష్ట చర్యలు చేపట్టారు. సిసి కెమెరాల పర్యవేక్షణలో పరీక్షలను



నిర్వహిస్తున్నారు. పరీక్షా కేంద్రాల్లోని సిసి కెమెరాలను కమాండ్ కంట్రోల్‌తో అనుసంధానం చేసినట్లు అధికారులు తెలిపారు. ప్రతి కదలికను గుర్తించేలా పర్యవేక్షణ ఉండనుంది. పరీక్షా కేంద్రంలోకి ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించడం లేదు. అభ్యర్థులకు బయోమెట్రిక్ విధానంతో పాటు తొలిసారి ఫేస్ రికగ్నైజేషన్ విధానాన్ని అమలు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. అభ్యర్థులకు సమయానికి పరీక్షా కేంద్రాలకు చేరుకునే విధంగా ఆర్‌టిసి అధికారులు బస్సులను నడపనున్నారు. పరీక్షల సమయంలో ఎటువంటి విద్యుత్ అంతరాయం లేకుండా విద్యుత్ శాఖ అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఎండల తీవ్రత దృష్ట్యా పరీక్షా కేంద్రం వద్ద తాగునీరు, ఇతర సదుపాయాలతో పాటు ఒఆర్‌ఎస్ ప్యాకెట్లు, ఇతర వసతులను కల్పిస్తున్నారు. పరీక్షా కేంద్రం వద్ద గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. పరీక్షల నిర్వహణలో సమస్యలు తలెత్తితే ఎపిపిఎస్ అసిస్టెంట్ సెక్రటరీ ఎన్.ప్రమీల (9014550846), సెక్షన్ ఆఫీసర్ ఎం.అమ్మాజీ (9014550882) ఫోన్ నంబర్లను సంప్రదించాలని అధికారులు సూచించారు.

బీమా ఉద్యోగులకు న్యాయం చేయాలి

ఎంపీకి ఇన్సూరెన్స్ పెన్షనర్స్ వినతి

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

నామమాత్రపు పెన్షన్‌తో ఇబ్బంది పడుతున్న బీమా సంస్థ ఉద్యోగులకు న్యాయం చేయాలని అఖిల భారత బీమా విశ్రాంత ఉద్యోగుల జిల్లా సంఘం ప్రతినిధి బృందం కోరింది. ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడుని ఆయన కార్యాలయంలో శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేసింది. సంఘ అధ్యక్ష, కార్యదర్శులు కొయ్యాన నారాయణ, ఎం.ఆదినారాయణ మూర్తి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం, ప్రభుత్వరంగ బ్యాంకులు, రిజర్వుబ్యాంకుల్లో పనిచేసిన విశ్రాంత ఉద్యోగుల కుటుంబ పెన్షన్ మూల వేతనంలో 30 శాతం పింఛన్ వస్తుండగా, బీమా సంస్థల విశ్రాంత ఉద్యోగుల కుటుంబ పెన్షన్ 15శాతం మాత్రమే దక్కుతోందని వివరించారు. జీవిత బీమా సంస్థ బోర్డు 2019 సెప్టెంబర్‌లోనే 30 శాతానికి పెంచాలని కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేసిందని గుర్తు చేశారు. ప్రభుత్వ పెన్షన్ పథకాలకు భిన్నంగా, బీమా సంస్థల పెన్షన్ నిధి సమృద్ధిగా ఉన్నందున ప్రభుత్వ నిధులపై భారం పడదని చెప్పారు. ఏళ్లు గడుస్తున్నా కేంద్ర ఆర్థికశాఖ సిఫార్సులను అమలు చేయకపోవడం శోచనీయమన్నారు. సిఫార్సుల అమల్లో జాప్యం కారణంగా చనిపోయిన బీమా విశ్రాంత ఉద్యోగుల కుటుంబాలు తీవ్ర ఆర్థిక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ఎంపీ స్పందిస్తూ ఈ అంశంపై కేంద్ర ఆర్థికశాఖ మంత్రికి లేఖ రాస్తామని హామీనిచ్చారు. ఎంపీని కలిసిన వారిలో అఖిల భారత ఇన్సూరెన్స్ పెన్షనర్స్ సంఘం కోశాధికారి బి.పి.సి.కె మోహన్‌రాజు, వి.జి.కె మూర్తి, బి.శివాజి, ఎం.ప్రభాకరరావు, ఎం.వి కామేశ్వరరావు తదితరులున్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఉద్యోగుల ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం

ప్రజాశక్తి - పలాస

ఉద్యోగుల సమస్యలను పరిష్కరించకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యదర్శి అలికాన రాజేశ్వరి, పలాస-కాశీబుగ్గ అధ్యక్షులు ఎన్.లక్ష్మీనారాయణ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సంఘం ఆధ్వర్యాన ఉద్యోగులు స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద శుక్రవారం రిలే నిరాహార దీక్షను చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని పలుమార్లు కోరినా పట్టించుకోవడం లేదని విమర్శించారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా ఉంటూ సంక్షేమ పథకాలను ప్రజలకు అందిస్తున్న ఉద్యోగుల విషయంలో ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని ధ్వజమెత్తారు. ఉద్యోగులపై ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిపై విసిగిపోయామన్నారు. ఉద్యోగులకు ప్రతినెలా ఒకటో తేదీన జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. బకాయి పడిన డిఎలు, ఎరియర్స్‌ను తక్షణమే విడుదల చేయాలన్నారు. ఉద్యోగులు దాచుకున్న పిఎఫ్, ఎపిజిఎల్ఐలకు రక్షణ కల్పించాలన్నారు. కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేసి కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం సమస్యలు పరిష్కరించని పక్షంలో ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమస్యలు పరిష్కరించకుంటే నవంబరు ఒకటో తేదీ నుంచి నిరవధిక సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు పి.రామారావు, ఎస్.రాజు, ఎస్.లక్ష్మీనారాయణ, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.



దీక్షలో కూర్చొన్న ఉద్యోగులు


ఎంపీతో మాట్లాడుతున్న వి.జి.కె మూర్తి

ఎన్‌టిఆర్ ఎంహెచ్ స్కూల్‌ను అభివృద్ధి చేయాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

నగరంలోని ఏడు రోడ్ల కూడలి వద్ద ఉన్న ఎన్‌టిఆర్ ఎంహెచ్ స్కూల్‌లో తిలక్ హాల్ నిర్మాణానికి ఎంపీ ల్యాడ్స్ నిధుల నుంచి కేటాయించాలని స్కూల్ పూర్వ విద్యార్థుల ప్రతినిధి బృందం విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడును శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఎంపీ మున్సిపల్ కమిషనర్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడితో మాట్లాడి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు. ఎంపీని కలిసిన వారిలో పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షులు వి.జె.కె.మూర్తి, కోశాధికారి జి.ఎస్.ఎస్.ప్రకాష్, నాయకులు పాలిశెట్టి మల్లిబాబు, కిల్లాన పాల్గుణరావు, టి.బాలమురళీకృష్ణ ఉన్నారు.


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

లౌకికశక్తులు ఏకం కావాలి

ప్రజాశక్తి- టెక్కలి

బిజెపి నుంచి భారతదేశాన్ని కాపాడాలంటే ప్రజాస్వామ్య లౌకిక శక్తులందరూ ఏకం కావాల్సిన అవసరం ఉందని భారత బచావో జిల్లా కన్వీనర్ పేడాడ పరమేశ్వరరావు అన్నారు. మండలంలోని పాతనౌపడలో భారత్ బచావో పోస్టర్లను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉద్యమం రాజకీయ పార్టీలకతీతంగా భిన్న భావజాలం కలిగిన శక్తులను సమాయత్తం చేసే వేదిక అని అన్నారు. ఎన్నికల్లో బిజెపికి వ్యతిరేకంగా ఒకే ఉమ్మడి అభ్యర్థి ఉండేలా భారత్ బచావో ప్రయత్నిస్తుందన్నారు. ప్రాంతీయ పార్టీల అప్రజాస్వామిక విధానాలపైనా ఉద్యమించాలన్నారు. ఈనెల 11న టెక్కలి అంబేద్కర్ భవన్‌లో మొదటి సమావేశం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సమావేశానికి ప్రజాస్వామ్య వాదులు, లౌకికవాదులు, దళితులు, మైనార్టీలు, వామపక్ష వాదులు, మేధావులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మిస్క కృష్ణయ్య, కోత ధర్మారావు, బెలమర ప్రభాకరరావు, డి.వెంకటరావు, బమ్మిడి ఊర్మిళ, కమల, టి.వినయ్, పేడాడ సూర్యనారాయణ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై సమీక్ష

ప్రజాశక్తి- టెక్కలి


సమీక్షిస్తున్న రాహుల్‌కుమార్‌రెడ్డి

గడపగడపకు కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో వచ్చిన వినతులు మేరకు చేపట్టిన పనులు త్వరితగతిన పూర్తి చేయాలని టెక్కలి సబ్‌కలెక్టర్ టి.రాహుల్‌కుమార్ రెడ్డి ఆదేశించారు. కోరారు. తన ఛాంబర్‌లో పిఆర్ అధికారులతో శుక్రవారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డివిజన్‌లో ఇప్పటి వరకు పంచాయతీల ద్వారా వచ్చిన వినతుల మేరకు చేపట్టిన పనులు జాబితాలో ప్రాధాన్యత క్రమంగా చేపట్టాలన్నారు. ప్రధానంగా రోడ్లు, కాలువల నిర్మాణాలు, సాగునీటి వనరుల వినియోగం దృష్ట్యా చేపడుతున్న పనుల్లో ఇప్పటి వరకు ఏ మేరకు పూర్తి చేశారని సమీక్షించారు. ఇందుకు మంజూరైన నిధుల వినియోగంతో పాటు పనుల నిర్మాణంలో నాణ్యత పాటించే విధంగా అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. సమావేశంలో ఇఇ రమేష్, డిఇ ధర్మారావు, జెఇ శీపాన లచ్చుంనాయుడు పాల్గొన్నారు.

నిర్వాసితుల స్థలం ఆక్రమణ!

- రూ.రెండు లక్షల చొప్పున విక్రయం
- తూతూమంత్రంగా రెవెన్యూ అధికారుల చర్యలు

ప్రజాశక్తి- పలాస

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో ప్రభుత్వ భూములకు రక్షణ లేకుండా పోయింది. ఎక్కడ చూసినా కొండ పోరంపోగు, డి-పట్టాలు, ప్రభుత్వ భూములు, అభివృద్ధి కోసం త్యాగం చేసిన నిర్వాసితుల స్థలాలను సైతం ఆక్రమణకు గురయ్యాయి. ఇళ్ల స్థలం రూ.2 లక్షలు చొప్పున విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. నిత్యం అదే పనిలో ఉన్న కొంత మంది భూ బకాసురులు ఇష్టానసారంగా భూములను ఆక్రమించుకుంటూ పునాదులు వేస్తున్నారు. రెవెన్యూ అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని విమర్శలు జోరుగా వినిపిస్తున్నాయి. కాశీబుగ్గ రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి ఆ ప్రాంత వాసులు కోట్లు విలువ చేసే నివాస గృహాలు, దుకాణాలను సైతం త్యాగం చేశారు. అందుకు ప్రభుత్వం, అధికారులు నిర్వాసితుల కోసం నెమలి రెవెన్యూ పరిధిలో సర్వే నంబరు 346లో పార్టులో భాగంగా రెండెకరాల స్థలాన్ని ప్రభుత్వం కేటాయించింది. రైల్వే పై ఓవర్‌లో నివాస గృహాలు దుకాణాలను కోల్పోయిన 127 మంది నిర్వాసితులకు స్థలాలు ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధం చేసింది. ప్రస్తుతం ఆ స్థలాలు నిర్వాసితులకు అందించకపోవడంతో ఖాళీగా ఉంది. దీనిపై కన్నేసిన కబ్జాదారులు ఇప్పటికే ఎకరాకు పైగా అమ్మకాలు చేపట్టడంతో ఆ ప్రాంతంలో నిర్మాణాలు జోరందుకున్నాయి. మిగిలిన ఎకరా స్థలం కూడా క్రమేపీ కబ్జా చేసి ఒక్కో స్థలం అంటే 600 గజాలు స్థలాన్ని రూ. 2 లక్షల చొప్పున విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. కొద్ది నెలల క్రితం పశుసంవర్ధకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ప్రజా దర్బారు నిర్వహించి ప్రభుత్వ స్థలాలు కబ్జా చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అధికారులకు కూడా తగు ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమానికి జెసి ఎం.నీవన్ కూడా హాజరయ్యారు. పలాస మున్సిపల్ కార్యాలయంలో రెవెన్యూ దర్బార్ నిర్వహించి మూడు నెలలు కాకముందే నెమలి కొండను ఇప్పటికే గుండు చేసిన కబ్జాదారులు మిగిలిన భూమిలో కంకర తవ్వకాలు చేపట్టి కాసులు సంపాదించు కుంటున్నారు. ఇప్పటికే చాలా స్థలాన్ని అమ్మకాలు చేపట్టినట్లు బహిరంగనే అక్కడ ప్రజలు చెబుతుండడం విశేషం. ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్వాసితుల కోసం కేటాయించిన భూములు ఆక్రమణకు గురైతే అధికారులు మాత్రం చోద్యం చూస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నారు. అసలు ఈ భూములు కబ్జాలకు పాల్పడుతుంది ఎవరు అనే విషయాలు ఆరా తీసి వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాల్సి ఉండగా, రాజకీయ నేతల ఆశీస్సులు పుష్కలంగా ఉండడంతో కొండ మొత్తం కబ్జా చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారనే విమర్శలు జోరుగా వినిపిస్తున్నాయి. నిర్వాసితుల కోసం కేటాయించిన భూములను ఏ విధంగా వారికి అప్పగిస్తారో రెవెన్యూ అధికారులే సమాధానం చెప్పాల్సి ఉంది. ఈ విషయంపై పలాస రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌ను వివరణ కోరగా, ఆ ప్రాంతాన్ని ఫ్లై ఓవర్ నిర్వాసితుల కోసం ఏటాయించారని, అయితే ఆ స్థలంలో ఇళ్ల నిర్మాణాలు, పునాదులు వేసిన మాట వాస్తవమే అని చెప్పారు. ఇప్పటికే అక్రమ దారులకు నోటీసులు జారీ చేశామని, పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని అన్నారు. ఆ స్థలాలను ఎవరు కొనుగోలు చేసినా చెల్లదని చెప్పారు. ఈ విషయాన్ని ప్రజలు తెలుసుకోవాలన్నారు.


నిర్వాసితుల స్థలంలో వేసిన పునాదులు

కొనసాగుతున్న పారిశుధ్య కార్మికుల ఆందోళన

ప్రజాశక్తి- పొందూరు

పారిశుధ్య కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ పొందూరు పంచాయతీ కార్యాలయం సమీపంలో కార్మికులు చేపడుతున్న ఆందోళన శుక్రవారం రెండో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా తమ సమస్యలు పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యాన తహశీల్దార్ ఎస్.రాంబాబు, ఎంపిడిఒ విశ్వేశ్వరరావులను శుక్రవారం వేర్వేరుగా వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.అమ్మన్నాయుడు మాట్లాడుతూ దుమ్ము, ధూళి, దుర్గంధం, అనారోగ్యాన్ని సైతం లెక్క చేయకుండా మురుగునీరంతా శుభ్రం చేస్తూ... ప్రజారోగ్యాన్ని పరిరక్షిస్తూ గ్రామ పంచాయతీ కార్మికులు ప్రజలకు సేవలందిస్తున్నారని అన్నారు. నాలుగేళ్లుగా కార్మికుల వేతనాలు పెంచకపోవడంతో చాలీచాలని వేతనాలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పెరిగిన నిత్యావసర సరుకుల ధరలు, వైద్య ఖర్చులు భరించలేక కార్మికుల కుటుంబాలు అల్లాడుతున్నాయని, నిత్యావసర సరుకుల ధరల పెరుగుదలకు అనుగుణంగా వేతనాలు పెంచకపోవడంతో కార్మిక కుటుంబాల జీవనం కష్టంగా ఉందని అన్నారు. కార్మికులకు ఇఎస్‌ఐ అమలు చేయాలని డిమాండ్ చేశారు. గతం కంటే జనాభా, వీధులు పెరగాయని పెరిగిన పంచాయతీ విస్తరణకనుగుంగా కార్మికుల సంఖ్య పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పి.నాగరాజు, పి.కనకరాజు, పి.కొండయ్య, సిహెచ్.కనకమ్మ, పి.కనకలక్ష్మి, పి.బుజ్జి పాల్గొన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న పారిశుధ్య కార్మికులు

నిస్వార్థ నాయకుడు బొడ్డేపల్లి రాజగోపాలరావు


చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న నాయకులు

కోటబొమ్మాళి: నిస్వార్థ రాజకీయ నాయకుడు, ప్రజా సేవకుడు కీర్తిశేషులు బొడ్డేపల్లి రాజగోపాలరావు అందరికీ స్ఫూర్తి ప్రదాత అని ఎంపిపి రోణంకి ఉమామల్లేశ్వరరావు అన్నారు. బొడ్డేపల్లి రాజగోపాలరావు శత జయంతి వేడుకలు సందర్భంగా శుక్రవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాకు రాజగోపాల్ చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. ముఖ్యంగా వంశధార కాలువను తెచ్చి జిల్లా అకలి బాధల నుంచి తప్పించారని అన్నారు. కార్యక్రమంలో మండల కళింగ కార్పొరేషన్ చైర్మన్ సంపతిరావు హేమసుందరరాజు, మండల విప్ బొడ్డు అప్పన్న, నూక సత్యరాజు, పేడాడ వెంకటరావు, బమ్మిడి గణపతి, కవిటి రామరాజు, హనుమంతు గోవింద్, సింగుపురం వినోద్, సనపల కృష్ణమూర్తి, కాళ్ల సంజీవరావు, వంశధార విద్య సంస్థల అధినేత చింతాడ అనిరుద్ధుడు, న్యాయవాది లఖినేని శ్రీనివాస్, ఉపాధ్యాయుడు లఖినేని కరుణాకర్, సనపల కరుణ్‌కుమార్, మెట్ట వేణు, ఎల్.వి.ప్రతాప్, పైడి పోలినాయుడు పాల్గొన్నారు.

'ఐతమ్' అధ్యాపకునికి డాక్టరేట్

ప్రజాశక్తి- టెక్కలి రూరల్


వెంకటరావు

టెక్కలి ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ ఇంజినీరింగ్ కళాశాల బేసిక్ సైన్స్ హ్యుమేనిటీస్ విభాగానికి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ వెంకటరావు బోనుకు విశాఖపట్నం ఆంధ్రా యూనివర్సిటీ అప్లైడ్ మేథమేటిక్స్ కోర్సులో పిహెచ్ పట్టాను మంజూరు చేసిందని కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రొఫెసర్ టి.లింగరాజు మార్గదర్శకత్వంలో 'అస్టడీ ఎంహెచ్ హీట్ ట్రాన్స్ఫర్ ఆఫ్ టూ ఫ్లూయిడ్ ప్లాస్మా ఫ్లోస్ ఇన్ ఎ హారిజెంటల్ ఛానల్ విత్ హాల్ అండ్ రొటేషన్ ఎఫెక్ట్స్' అనే అంశంపై చేసిన పరిశోధనకు ఈ పిహెచ్ పట్టాను ఆంధ్రా యూనివర్సిటీ జారీ చేసిందన్నారు. డాక్టర్ వెంకటరావు బోను పిహెచ్ డిగ్రీ సాధించడంపై నాగేశ్వరరావుతో పాటు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, డీన్ ఆరెన్డీ డాక్టర్ డి.ఆజాద్, బిఎస్ఇండెచ్ హెచ్ఐడి డాక్టర్ ఆర్.శాంతికుమార్, భోదన, భోధనేతర సిబ్బంది అభినందించారు.

హోంమంత్రి దృష్టికి క్రిస్టియన్ల సమస్యలు



హోంమంత్రితో అన్వేష్

ఇచ్ఛాపురం : జిల్లాలో నెలకొన్న క్రిస్టియన్ సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని క్రిస్టియన్ మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షుడు ప్రత్తి అన్వేష్ కోరారు. రాజమండ్రిలో శుక్రవారం నిర్వహించిన క్రిస్టియన్ మైనార్టీ ఫెలోషిప్ సమావేశంలో హోంమంత్రి తానేటి వనిత ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సమయంలో క్రిస్టియన్ల సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించారని అన్వేష్ తెలిపారు.



బస్సు ఢీకొని వస్త్ర వ్యాపారి మృతి

ప్రజాశక్తి- ఆమదాలవలస


శాంతారావు (ఫైల్)

పట్టణంలోని రైల్వేస్టేషన్ కూడలి వద్ద ఉన్న మెయిన్ రోడ్‌పై కొత్తూరు నుంచి శ్రీకాకుళం వైపు వెళ్తున్న ఆర్‌టిసి బస్సు ఢీకొని పట్టణానికి చెందిన వస్త్ర వ్యాపారి అమనాన శాంతారావు (72) మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ఇలా ఉన్నాయి. పట్టణంలోని లక్ష్మీనగర్ వీధికి చెందిన శాంతారావు మెయిన్ రోడ్డుపై వస్త్ర దుకాణం నిర్వహిస్తున్నాడు. శుక్రవారం సాయంత్రం మార్కెట్‌లోకి వ్యక్తిగత పనులపై వెళ్లి తిరిగి సైకిల్‌పై దుకాణానికి వస్తుండడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. మృతుడుకు భార్య జయభారతి, ముగ్గురు కుమార్తెలు అనూష, శిరీష, అనసూయ ఉన్నారు. ముగ్గురికీ పెళ్లిళ్లు కావడంతో ఒకరు కెనడా, మరో సౌదీ, ఇంకొకరు పలాసలో ఉంటున్నారు. విషయం తెలుసుకున్న మృతుడి భార్య, చిన్న కుమార్తె ఘటనాస్థలానికి చేరుకుని రోదించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని శవపంచనామా నిర్వహించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం జిల్లా సర్వజనాస్పత్రికి తరలించారు. ఎస్ఐ రఘునాథరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఈ పట్టణంలో విషాద ఛాయలు అలముకున్నాయి. శాంతారావు మృతికి నివాళిగా పట్టణంలోని వస్త్ర దుకాణాలను మూసివేశారు. పట్టణంలో మెయిన్ రోడ్ పైనే తోపుడు బళ్లతో వ్యాపారాలు నిర్వహించడంతో తరుచూ ఇటువంటి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పట్టణంలో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించి మున్ముందు ఇటువంటి ప్రమాదాలు చోటు చేసుకోకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.


భాను మృతదేహం

వివాహిత ఆత్మహత్య!

ప్రజాశక్తి- పలాస

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ గాంధీనగర్‌కు చెందిన కోల భాను (35) శుక్రవారం ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మృతురాలి భర్త కోల హరి పెయింటర్ పనిచేస్తున్నాడు. వీరికి ఏడేళ్ల క్రితం వివాహమైంది. అప్పటి నుంచి వీరికి సంతానం కలగలేదు. ఈ విషయంపై గురువారం రాత్రి భర్తతో తగాదా పడినట్లు సమాచారం. శుక్రవారం ఉదయం బయటకు వెళ్లిపోవడంతో ఆమె ఇంట్లోని ఫ్యాన్ కొక్యానికి చీర వేసి ఆత్మహత్యకు పాల్పడింది. బయటకు వెళ్లిన భర్త హరి ఇంటికొస్తే చూసేసరికి భాను ఉరి వేసుకోవడం చూసి స్థానికుల సహాయంతో కిందకు దించి స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించగా... అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. పిల్లల లేరని ఆత్మహత్య చేసుకుందా? ఇంకేమైనా కారణాలున్నాయంటూ స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ సంఘటనపై కాశీబుగ్గ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అనధికార లిఫ్ట్‌లను నియంత్రించాలి


మాట్లాడుతున్న మోహనరావు

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

వంశధార కాలువలో ఏర్పాటు చేసిన అనధికారిక లిఫ్ట్‌లను ప్రభుత్వం నియంత్రించి శివారు ప్రాంత భూములకు సాగునీరు అందింఅచలని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి కోనారి మోహనరావు డిమాండ్ చేశారు. మండలంలోని సీతాపురంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. అనధికారిక లిఫ్ట్‌లతో వంశధార మరమ్మతులు గురి కావడంతో నాలుగేళ్లుగా శివారు ప్రాంత భూములకు సాగునీరు అందడం లేదన్నారు. దీంతో కరువు ఛాయలు అలముకున్నాయని అన్నారు. సాగునీరు అందక పంట నష్టం వాటిల్లుతుంటుందన్నారు. మరో వైపు అధికారులు నీటి తీరువ వసూళ్లు చేయడం రైతులపై మరింత ఆర్థికభారం పడుతుందన్నారు. వంశధార 60 ఆర్ఎల్ కనితివురు నుంచి 5 ఎల్ బెండి వరకు కాలువలో పేరుకుపోయిన పూడికలను తొలగించాలన్నారు. చెరుకుపల్లి వద్ద చెక్‌డాం మరమ్మతులు చేపట్టాలన్నారు. బెండు గెడ్డపై లిఫ్ట్ ఏర్పాటు చేస్తే సీతాపురం, బొడ్డపాడు, బెండి గ్రామాల్లో 900 ఎకరాలు సస్యశ్యామలమవుతుందని అన్నారు. లిఫ్ట్ ఏర్పాటుకు పశు సంవర్ధకశాఖ మంత్రి డాక్టర్ అప్పలరాజు కృషి చేయాలన్నారు. ఖరీఫ్ సీజన్‌లో ముందిస్తు చర్యలు చేపట్టి శివారు ప్రాంతాల్లోని చెరువులను నీటితో నింపాలన్నారు. ఈయనతో పాటు రైతు సంఘం మండల కార్యదర్శి తమ్మినాన భాస్కరరావు, సర్పంచ్ తమ్మినేని ఢిల్లీరావు, టి.వాసు ఉన్నారు.


పాల్గొన్న గ్రామస్తులు


మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి

గ్రానైట్ క్వారీపై ప్రజాభిప్రాయ సేకరణ

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలో రాజపురం లైఫ్ స్టైల్ ఫర్ ఇన్విరాల్‌మెంట్ గ్రానైట్ (శ్రీనివాస్) క్వారీకి ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసింది. దీంతో రాజపురం, పరిసర గ్రామస్తుల తో టెక్కలి సబ్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్ రెడ్డి గ్రానైట్ ఏర్పాటుకు సంబంధించి శుక్రవారం పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించా రు. 250 ఎకరాల్లో గ్రానైట్ తవ్వకాలకు ప్రభుత్వం అనుమతులు ఇవ్వడంతో ఈ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో గ్రానైట్ పరిశ్రమ వల్ల పర్యావరణం కాలుష్యం గురికాకుండా చూడాలని గ్రామస్తులు సబ్ కలెక్టర్‌ను కోరారు. గ్రానైట్ పరిశ్రమ వల్ల చుట్టు పక్కల పది గ్రామాల ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. లిక్విడ్ వంటి రసాయనాలు వాడరాదన్నారు. 50 సెల్స్ శబ్ధ కాలుష్యం దాట రాదని, అలాగే దీనికి అనుకుని రెండు చెరువులు ఉన్నాయని, దీనిద్వారా 20 ఎకరాలకు సాగు అవుతుందని, సాగుకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడాలని కోరారు. ఇప్పుడున్న రోడ్డును వెడల్పు చేయాలని కోరారు. తాగునీటి సౌకర్యం లేనందున ఆర్ఒ ప్లాంట్ ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరారు. మా గిరిజనుల ఆరాధ్య కొండ దేవతలు ఉన్నాయని, వాటికి ఆలయాలు, ప్రహరీ నిర్మించాలన్నారు. అలాగే గ్రామ మౌలిక సౌకర్యాలు, అభివృద్ధి చేయాలని కోరారు. గ్రానైట్ లో స్థానిక యువకులకు ఉపాధి కల్పించాలన్నారు. గ్రానైట్ నుంచి వచ్చే సెస్సు జోడూరు, మారేడికోట, పట్టుపురం పంచాయతీల కు వర్తింపజేయాలన్నారు. కార్యక్రమంలో టెక్కలి మైనింగ్ ఎడి ఫణిభూషణ్‌రెడ్డి, తహశీల్దార్ పి.సరోజని, సర్పంచ్‌లు సంపతరావు లక్ష్మి, పెద్దింటి శ్రీనివాసరావు, బెజ్జపల్లి కూర్మారావు రెవెన్యూ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.


ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న ఆర్‌డిఒ సీతారామ్మూర్తి

అంగన్వాడీ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి- పలాస

డివిజన్‌లోని పలాస, ఇచ్ఛాపురం, ఇచ్ఛాపురం రూరల్ ఐసిడిఎస్ ప్రాజెక్టుల్లో ఖాళీగా ఉన్న అంగన్వాడీ కార్యకర్తలు, మినీ అంగన్వాడీ కార్యకర్తలు, ఆయా పోస్టుల భర్తీకి ఆర్‌డిఒ టి.సీతారామ్మూర్తి శుక్రవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఇచ్ఛాపురం అర్బన్ పరిధిలో అంగన్వాడీ ఒకటి, మినీ అంగన్వాడీ ఒకటి, ఆయా పోస్టులు 17 ఖాళీ ఉండగా, 51 మంది హాజరయ్యారు. ఇచ్ఛాపురం రూరల్ పరిధిలో రెండు అంగన్వాడీ, రెండు ఆయా పోస్టులు ఖాళీగా ఉండగా, 10 మంది హాజరయ్యారు. కాశీబుగ్గ ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలో ఖాళీలున్న నాలుగు అంగన్వాడీ కార్యకర్తలు, ఒకటి మినీ అంగన్వాడీ, 13 ఆయాలకు పోస్టులకు 65 మంది అభ్యర్థులు హాజరయ్యారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ ప్రాజెక్టు పిఒలు శార్వాణి, నాగరాణి, వసుంధర పాల్గొన్నారు. ఐసిడిఎస్ ప్రాజెక్టు పీడీ జయాదేవి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి పర్యవేక్షించారు. ఇదిలా ఉండగా ఆర్‌డిఒ కార్యాలయం వద్ద ఇంటర్వ్యూలు నిర్వహించడంతో ఇచ్ఛాపురం నుంచి నందిగాం వరకు అంగన్వాడీ కార్యకర్తలు, మినీ అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు ఉదయం 8 గంటలకే చేరుకున్నారు. అయితే ఇంటర్వ్యూలకు హాజరైన అభ్యర్థులకు రెవెన్యూ, ఐసిడిఎస్ అధికారులు ఇటువంటి మౌలిక సదుపాయాలు కల్పించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఒకవైపు తీవ్ర స్థాయిలో భానుడు ఉగ్రరూపానికి మహిళలు విలవిల్లాడిపోయారు. కనీసం తాగునీరు సౌకర్యం కూడా కల్పించలేదు. కార్యాలయం వద్ద టెంట్లు, కుర్చీలు లేక మండుటెండలో అవస్థలు పడ్డారు. చాలా మంది మహిళలు కార్యాలయం లోపల ఇబ్బంది పడి కూర్చోవాల్సి వచ్చింది. డివిజన్ స్థాయిలో ఇంటర్వ్యూలు నిర్వహించినప్పుడు మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. అయినా ఆ దిశగా చర్యలు చేపట్టకపోవడంతో ఇంటర్వ్యూకు హాజరైన అభ్యర్థులు, వారితోపాటు వచ్చిన సహాయకులకు అవస్థలు తప్పలేదు.


నేలపై కూర్చున్న అభ్యర్థులు

భూ ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి- పలాస/మందస

గిరిజన రైతులు సాగులో ఉన్న భూములను భూ ఆక్రమణదారులు ఆక్రమించుకుంటున్నారని, దీనిపై ఫిర్యాదు చేసినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని మందస మండల చీపి పంచాయతీ లొడగపిట్ట, చొక్కాంబో, కాశిగాం గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు పలాస ఆర్‌డిఒ సీతారామ్మూర్తి, మందస తహశీల్దార్ బి.పాపారావులను శుక్రవారం కలిసి వినతిపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఐదు దశాబ్దాల నుంచి తమ సాగులో ఉన్న 70 ఎకరాల భూములను కొంతమంది సర్వే నంబర్లను పట్టుకొచ్చి భూములను సర్వే చేస్తుండగా అడ్డుకున్నామని అన్నారు. తమ భూములను ఎందుకు సర్వే చేస్తున్నారని అడిగితే... ఆ భూములు తమ పేర్లతో ఉన్నాయని, అందుకే సర్వే చేస్తున్నామని సమాధానం ఇస్తున్నట్లు వారు తెలిపారు. తాత, ముత్తాతల నుంచి భూములపై వ్యవసాయం చేసుకుంటూ బతుకున్నామని, తమ భూములను కబ్జా చేసేందుకు ఆక్రమార్కులు ప్రయత్నించడం విడ్డూరంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. తమ భూములకు, గిరిజనులకు రక్షణ కల్పించాలని భూ ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి సవర చిరంజీవి, బుడ్డు, కడంజి, రఘునాధ్, మోహన్, సవర ధర్మారావులు పాల్గొన్నారు.


తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న గిరిజనులు

పట్టణమంతా చెత్తమయం


బస్టాండ్ ఆవరణలో పేరుకుపోయిన చెత్త పోగు

పొందూరు పట్టణంలో ఏ వీధి చూసినా, ఏ రోడ్డు చూసినా చెత్తాచెదారాలే దర్శినమిస్తున్నాయి. పంచాయతీ పారిశుధ్య కార్మికులు తమకు వేతనాలు పెంచాలని కోరుతూ రెండు రోజులుగా సమ్మె నిర్వహిస్తున్నారు. దీంతో పట్టణంలో పారిశుధ్య పనులు చేపట్టకపోవడంతో ఎక్కడికక్కడ చెత్తపోగులు కుప్పలుగా పేరుకుపోయాయి. చిన్నపాటి గాలి వీచినా చెత్తా చెదారాలు ఎగురుతుండడంతో పాటు దుర్వాసనతో ప్రజలు అల్లాడిపోతున్నారు. ఈ చెత్తపోగుల వద్ద కుక్కలు గుంపులు గుంపులుగా కుక్కలు తిరుగుతున్నాయి. కుక్కలు ఎక్కడ దాడి చేస్తాయో? అని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. చెత్త పోగులు మరో రెండు రోజులు ఇలా ఉంటే రోగాలు బారిన పడే అవకాశం ఉందంటూ ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అధికారులు తక్షణమే పారిశుధ్య పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

- ప్రజాశక్తి, పొందూరు


కోరుకొండ వీధిలో చెత్తపోగులు


నెహ్రూ పార్కు ముందర రహదారిపై ఉన్న చెత్త



మార్కెట్ రోడ్డులో నిల్వ ఉన్న చెత్త


ద్విచక్ర వాహనం సీట్ కవర్‌ను కోసేసిన ఆకతాయిలు

శృతిమించిన ఆకతాయిల చేష్టలు

ప్రజాశక్తి- ఆమదాలవలస

పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల చుట్టుపక్కల ప్రాంతాల్లో ద్విచక్ర వాహనాలకు నష్టం చేకూరుస్తూ కొందరు ఆకతాయిలు హల్‌చల్ చేస్తున్నారు. గురువారం అర్ధరాత్రి సాయి నగర్, దాలినాయుడు క్వార్టర్స్, పెంటయ్య క్వార్టర్ తదితర ప్రాంతాల్లో గత కొద్ది కాలంగా ద్విచక్ర వాహనాల సీటు కవర్లు, ట్యాంక్ కవర్లను కోసేస్తూ వాహనదారుల యజమానులకు ఇబ్బందులకు గురి చేస్తున్నారు. అలాగే పెట్రోల్‌ను కూడా తీసేస్తూ నరకయాతనకు గురి చేస్తున్నారని వాహనదారులు వాపోతున్నారు. ఇంటి బయట పెట్టిన సుమారు 30 ద్విచక్ర వాహనాలు గురువారం అర్ధరాత్రి నష్టం చేకూర్చారని అక్కడి వారు వాపోతున్నారు. రాత్రిపూట పట్టణంలో పోలీసు గస్తీ, భద్రత ఉందా? లేదా? అన్న అనుమానాలను వాహనదారులు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పోలీసులు కట్టుదిట్టమైన నిఘాను ఆకతాయిల చేష్టలను అరికట్టాలని కోరుతున్నారు.


పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ శ్రీనివాస్

పట్టుమహాదేవి చెరువు అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టెక్కలి మేజర్ పంచాయతీ పట్టుమహాదేవి చెరువును యాత్రికులకు ఆహ్లాదకరంగా ఉండే విధంగా అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు చెరువు పరిసరాలను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రోడ్డు పక్కన షాపింగ్ కాంప్లెక్స్‌తో పాటు గట్టు పైచుట్టూ సిసి రోడ్ నిర్మాణం చేపట్టి వాకింగ్ ట్రాక్, బెంచీలు ఏఆర్పటు చేస్తామని అన్నారు. ఇప్పటికే గట్టుపైన పుణ్యక్షేత్రాలు ఉన్నాయని చెప్పారు. అభివృద్ధికి రూ.2 కోట్లు ప్రతిపాదనలు పంపించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ గొండెలి సుజాత. ఎంపిటిసి పీత హేమలత, జిల్లా పరిషత్ ఇఇ వి.సురేష్ కుమార్, ఎఇ ఎస్.నాయుడు పాల్గొన్నారు.

కొనసాగుతున్న విజ్ఞాన శిబిరం


బలగలో కుర్చీ ఆట ఆడుతున్న విద్యార్థులు

శ్రీకాకుళం : జిల్లా కేంద్ర గ్రంథాలయంలో శుక్రవారం వేసవి విజ్ఞాన శిబిరం ఉదయం 8 నుంచి 12 గంటల వరకు నిర్వహించారు. ఉపాధ్యాయుడు ఎస్.ఈశ్వరరావు పిల్లలకు డ్రాయింగ్, మ్యూజికల్ చైర్ ఆట ఆడించారు, తెలుగు ఉపాధ్యాయుడు ఎస్.సాయికృష్ణ తెలుగు గ్రామర్ చెప్పారు. ఎస్.వి.రమణమూర్తి మాట్లాడుతూ వేసవి విజ్ఞాన శిబిరంలో పిల్లలు పాల్గొనడం ద్వారా మంచి ఆరోగ్యంతో అన్ని విషయాలూ తెలిసొస్తాయని అన్నారు. కార్యక్రమంలో పి.రామ్మోహన్, టి.రాంబాబు, పి.ఈశ్వరరావు, గణేష్ పాల్గొన్నారు.

బలగ : మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదపడతాయని విశ్రాంతి ఉపాధ్యాయులు కె.జనార్ధనరావు అన్నారు. నగరంలోని బలగ శాఖాగ్రంథాలయంలో పిల్లలకు కథలు, పద్యాలతో పాటు మ్యూజికల్ చైర్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమం గ్రంథాల అధికారి పి.ఉగ్రసేను పాల్గొన్నారు.

లావేరు : మంచి పుస్తకం మంచి స్నేహితుడితో సమానమని గ్రంథాలయంలో అందరూ పుస్తకాలు చదువుకొని నేటి బాలలే రేపటి పౌరులుగా మారాలని రిసోర్స్‌పర్సన్ రాంబాబు అన్నారు. మండలంలోని మురపాక శాఖాగ్రంథాలయంలో పుస్తకాల ప్రాధాన్యతపై మాట్లాడారు. గ్రంథాలయంలో ఉన్న పుస్తకాలను చదివి జ్ఞానాన్ని సంపాదించుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు, గ్రంథాలయ సహాయకులు పి.షణ్ముఖరావు పాల్గొన్నారు.

ఎచ్చెర్ల : మండలంలోని ధర్మవరం శాఖాగ్రంథాలయంలో కథలు చెప్పడం, చదవడం వాటిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి మలిపెద్ది చంద్రశేఖర్ కార్యక్రమంలో సూర్యనారాయణ, ప్రకాష్, సురేష్, జగదీష్, మహేష్, సురేష్, సూరిబాబు, కిరణ్, శంకర్ 71 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

టెక్కలి : స్థానిక గ్రంథాలయంలో విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి ఎస్.ఉదయ్‌కిరణ్, సహాయకులు అమ్మనమ్మ పాల్గొన్నారు.


రేవతీపతి విగ్రహానికి పూలమాలలు వేస్తున్న కృపారాణి

ఆదర్శ నాయకుడు రేవతీపతి

టెక్కలి : మాజీ ఎమ్మెల్యే డాక్టర్ కొర్ల రేవతీపతి రాజకీయంగా చేసిన ఆలోచనలు నేటి రాజకీయాలకు ఆచరణ వంటివని కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ కిల్లి కృపారాణి అన్నారు. టెక్కలిలో మాజీ ఎమ్మెల్యే కొర్ల భారతి అధ్యక్షతన రేవతీపతి వర్ధంతి కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ముందుగా తొలుసూరుపల్లి రోడ్డు వద్ద ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజకీయాల్లో రేవతీపతి చూపిన మార్గం ఆదర్శ ప్రాయమైందన్నారు. నీతి నిజాయితీలకు కట్టుబడి నిబద్ధత కలిగిన నాయకుడని పలువురు కొనియాడారు. కార్యక్రమంలో కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్, వైసిపి టెక్కలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి, జడ్‌పిటిసి దువ్వాడ వాణి, డాక్టర్ కిల్లి రామ్మోహనరావు, హనుమంతు ఉదయ్‌భాస్కర్, సత్తారు సత్యం, మోదుగువలస గణపతిరావు, శిరీష, శ్రీనివాసరావు పాల్గొన్నారు.


అవార్డు అందుకుంటున్న బాలు

'రేపటి ఫౌండేషన్'కు కీర్తి పురస్కారం

ప్రజాశక్తి- శ్రీకాకుళం

తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శ్రీకాకుళం జిల్లా నుంచి 'రేపటి ప్రయోజనం ఫౌండేషన్'కు కీర్తి పురస్కారం అందించారని ఫౌండేషన్ ఫౌండర్ బాన్నా భార్గవ్ (బాలు) ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవార్డును తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా జిల్లాకు రావడం, అందరి సహకారంతో చేసిన సేవలకు గుర్తింపు ఆనందంగా ఉందన్నారు. పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, నాంపల్లి హైదరాబాద్‌లో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఈ అవార్డును అందుకున్నానని తెలిపారు. ఈ అవార్డు మరింత బాధ్యతను పెంచిందన్నారు.

పూర్వ విద్యార్థుల ఆపన్నహస్తం


డిపాజిట్ పత్రాన్ని అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

ప్రజాశక్తి- ఆమదాలవలస

పాలకొండలో 1994లో పదో తరగతి చదివిన విద్యార్థులు బాల్యమిత్రులు పేరుతో ఆర్థిక సహాయం శుక్రవారం అందించా రు. తమ సహవిద్యార్థి అకాల మృతితో తల్లడిల్లుతున్న ఆ కుటుంబానికి రూ.1,27,000 అందించి తమ దాతృత్వం చాటారు. మండలంలోని అలికాం కాలనీకి చెందిన కొన్నెర్ల వేణు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఆయనకు భార్య, పదో తరగతి చదువుతున్న కుమారుడు, తొమ్మిదో తరగతి చదువుతున్న కుమార్తె ఉన్నారు. కుటుంబ పెద్దను కోల్పోయిన వారికి ఆర్థిక సహాయం అందించేందుకు పాలకొండకు చెందిన పూర్వ విద్యార్థుల బృందం ముందుకొచ్చింది. హెల్పింగ్ హేండ్స్ ప్రతినిధులు మండపాక శ్రీధర్, దుగ్గివలస రాంప్రసాద్, జోగి రాజేష్, పూర్వ విద్యార్థులకు విషయం చేరవేశారు. వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన మిత్రులంతా విరాళం సేకరించారు. ఈ మొత్తాన్ని మృతుని కుమార్తె పేరుతో పోస్టల్ సేవింగ్ ఖాతాలో ఐదేళ్లకు డిపాజిట్ చేసి సంబంధిత పత్రాన్ని అందజేశారు. జోశ్యుల రామకృష్ణ, మార్తాండ కృష్ణ పాల్గొన్నారు.

శ్రావణికి ఆర్థికసాయం

కోటబొమ్మాళి: కోటబొమ్మాళి మండలం గంగరాంకు చెందిన బుసకల శ్రావణి కొన్ని రోజులుగా బ్రెస్ట్ కేన్సర్‌తో బాధపడుతుంది. విషయం తెలుసుకున్న సంతబొమ్మాళి మండలంలోని బడే కుప్పన్నపేట స్పందన ఫౌండేషన్ సభ్యులు శుక్రవారం రూ.10 వేలు ఆర్థికసాయం అందజేశారు. శ్రావణికు ఆరోగ్యశ్రీ వర్తించినా మందులు, వైద్యం, రవాణా ఖర్చులు నిమిత్తం డబ్బులు అవసరమయ్యాయి. విషయం తెలుసుకున్న స్వచ్ఛంద సంస్థ సభ్యులు నగదు అందజేసి ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో అధ్యక్షులు షణ్ముఖరావు, మురళీధర్, శివరాం, వెంకటరావు, రాము, పూర్ణారావు పాల్గొన్నారు.


చిన్నారులతో మాట్లాడుతున్న రవికుమార్

'అంగన్వాడీ'కి ఎన్ఆర్ఐ వితరణ

రణస్థలం: రణస్థలం మండల కేంద్రంలోని గరికిపాలెం అంగన్వాడీ కేంద్రానికి విజయనగరం జిల్లా సాలూరుకు చెందిన ప్రస్తుతం అమెరికాలో నివసిస్తున్న చల్లా దంతేశ్వర రావు పలకలు, పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, సీలింగ్ ఫ్యాన్, గిన్నెలు, గ్లాసులు, పిల్లలు ఆడుకోవడానికి ఆట వస్తువులు తన స్నేహితుడు రవికుమార్ ద్వారా శుక్రవారం అందించారు. ఈ సందర్భంగా సిడిపిఒ ఝాన్సీబాయ్ మాట్లాడుతూ దాతలు ముందుకి వచ్చి అంగన్వాడీ పిల్లలకు సామగ్రి, ఆట వస్తువులు అందించడం అభినందనీయమన్నారు. దాతలు ముందుకొచ్చి అంగన్వాడీ కేంద్రాలను అభివృద్ధి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ మంగమ్మ, కార్యకర్త రూపసుధ, ఆయా హేమ పాల్గొన్నారు.


శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ లక్ష్మణరావు

మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యం

కవిటి: పంచాయతీలో మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యంగా పనిచేస్తున్నట్టు కవిటి సర్పంచ్ పూడి లక్ష్మణరావు తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా పంచాయతీకి మంజూరైన నిధుల్లో రూ.5 లక్షలతో కవిటి కొత్తూరులో రెండు సిసి డ్రైయిన్ల నిర్మాణా నికి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంచాయతీలో అన్ని గ్రామాలకూ సమాన ప్రాధాన్యత కల్పిస్తూ, పంచాయతీ అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిటిసి పూడి నీలాచలం, కో-ఆప్షన్ సభ్యుడు పాండవ శేఖర్, బెందాళం వెంకటరమణ, ఎంపిటిసి ప్రతినిధి దుద్ది ధర్మారావు, పిన్నింటి జయరాం పాల్గొన్నారు.

ముగిసిన ఉపాధ్యాయుల శిక్షణ

ప్రజాశక్తి- పలాస

విద్యార్థులకు ఆహ్లాదకరమైన బోధన కోసం తరగతి గదిలో కృత్యాలు రూపొందించాలని కోర్స్ డైరెక్టర్ వై.చిన్నంనాయుడు అన్నారు. కాశీబుగ్గ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గత నెల 15 నుంచి నిర్వహిస్తున్న ఉపాధ్యాయుల ఇండక్షన్ శిక్షణ శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ నేర్చుకున్న అంశాలన్నీ తరగతి గదిలో నెరవేర్చినప్పుడే శిక్షణ ఉద్దేశం నెరవేరుతుందని అన్నారు. అందుకు విద్యా సంవత్సరంలో ఉపాధ్యాయులు సమాయత్తం కావాలని పేర్కొన్నారు. ఐదు రోజుల పాటు నిర్వహించిన శిక్షణలో తెలుగు, ఆంగ్లం, పరిసరాల విజ్ఞానం, గణితం, జనరల్ విషయాలు తరగతి గది నిర్వహణ పాఠశాల నిర్వహణపై రాష్ట్ర రిసోర్స్ పర్సన్లు శిక్షణ ఇచ్చారు. కోర్సు కో-ఆర్డినేటర్ అల్లు అప్పన్న కె.చంద్రమౌళి, రాష్ట్ర రిసోర్స్ పర్సన్ ఎల్.వెంకటాచలం, పి.షణ్ముఖరావు, కె.భానోజీరావు, పి.వి.ఎస్.ఎస్.మూర్తి, జి.వాణికుమారి, పంచి రెడ్డి పాల్గొన్నారు. అనంతరం శిక్షణార్థులకు ధ్రువీకరణ పత్రాలను కోర్స్ డైరెక్టర్ చిన్నంనాయుడు అందజేశారు.


ధ్రువీకరణ పత్రాలను అందజేస్తున్న చిన్నంనాయుడు

కమిషనర్‌కు సన్మానం

పలాస : పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ కమిషనర్ టి.నాగేంద్రకుమార్‌కు నాయకులు శుక్రవారం దుశ్శాలువ కప్పి సన్మానించారు. గురువారం కమిషనర్‌గా నాగేంద్రకుమార్ బాధ్యతలు స్వీకరించిన విషయం తెలుసుకున్న నాయకులు కార్యాలయానికి చేరుకుని శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వైసిపి పట్టణ అధ్యక్షుడు, కౌన్సిలర్ సనపల సింహాచలం, కౌన్సిలర్ పప్పల ప్రసాద్, బడగల బాలచంద్రుడు, కో-ఆప్షన్ సభ్యులు బమ్మిడి సంతోష్, అంబటి ఆనందేలు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

టెక్కలి : వైసిపి ప్రభుత్వ హయాంలో అర్హత సాధించుకున్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి, జెడ్‌పిటిసి దువ్వాడ వాణి అన్నారు. మండలంలోని బన్నువాడ పంచాయతీ మోదుగువలసలో శుక్రవారం గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల విస్తరణ, వినియోగంపై గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. మూలపేట పోర్టు నిర్మాణం దృష్ట్యా తమ గ్రామానికి చెందిన వ్యవసాయ పంట భూములను కోల్పోవాల్సి వస్తుందని పలువురు బాధిత రైతులు వాణి ముందు సమస్య విన్నవించుకున్నారు. దీనిపై ఆమె స్పందిస్తూ అభివృద్ధి దృష్ట్యా కొన్ని త్యాగాలకు సిద్ధం కావాల్సి ఉందన్నారు. ఎంపిపి సరోజనమ్మ, సర్పంచ్‌లు మోహనరావు, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.


పలాస : మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ గిరిబాబు


కోటబొమ్మాళి : వాలంటీర్లను సన్మానిస్తున్న నాయకులు

వాలంటీర్ల సేవలు మరువలేనివి

పలాస : ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి ప్రవేశ పెట్టిన వాలంటీర్ల వ్యవస్థలో నిస్వార్థంగా పనిచేస్తున్న వాలంటీర్ల సహకారం, సేవలు మరువలేనివని మున్సిపాలిటీ మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు అన్నారు. ఈ మేరకు స్థానిక సచివాలయంలో వాలంటీర్లకు వందనం కార్యక్రమంలో సేవా పత్రాలతో శుక్రవారం సన్మానించారు. రాష్ట్ర ప్రభుత్వం వాలంటీర్ల సేవలను గుర్తిస్తూ... అందిస్తు న్న గౌరవ సేవా మిత్ర పురస్కారాలు అవార్డు గ్రహీతలకు అందజేశారు. కార్యక్రమంలో కమిషనర్ నాగేంద్రకుమార్, బడగల బల్లయ్య, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: ప్రభుత్వానికి ప్రజలకు సంక్షేమ సారథులు వాలంటీర్లు అని ఎంపిపి రోణంకి ఉమామల్లేశ్వరరావు, జెడ్‌పిటిసి దుబ్బ వెంకటరావులు అన్నారు. వాలంటీర్లకు వందనంలో మండలంలోని మాసాహెబ్‌పేట, తాటిపర్తి పంచాయతీల వాలంటీర్లకు సేవా పత్రాలతో ఘనంగా సన్మానించారు. సర్పంచ్‌లు ధనలక్ష్మి, రెడ్డి లక్ష్మణరావు, వెంకటరావు, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ హేమసుందర రాజు, రామణారావు, కార్యదర్శులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన

ఆమదాలవలస : మండలంలోని వెదుళ్లవలసలో జిల్లా కేంద్రంలోని మెడికవర్ ఆస్పత్రి సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. వైద్యులు హరిణి, చైతన్య ఆధ్వర్యాన రోగులకు బిపి, సుగర్, కీళ్లవాతం, కార్డియాలజీ, జనరల్ మెడిసిన్ తదితర విభాగాలకు సంబంధించిన పరీక్షలు నిర్వహించి ఉచిత మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యులు హరిణి, చైతన్యలు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వేసవి కాలంలో ఎండ తీవ్రత దృష్ట్యా వడదెబ్బ తగలకుండా ఉండడానికి కొబ్బరి నీళ్లు, మజ్జిగ వంటి చల్లని పదార్థాలు తీసుకోవాలని సూచించారు. వదులుగా ఉండే కాటన్ వస్త్రాలను ధరించాలన్నారు. బయటకు వెళ్లేటప్పుడు ఎండ దెబ్బ తగలకుండా గొడుగును వినియోగించాలని తెలిపారు. సర్పంచ్ సిహెచ్.సురేష్, సీతారామ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు చింతాడ అప్పారావు, మార్కెటింగ్ మేనేజర్ టి.ఎస్.ఎన్.మూర్తి, పి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.